చిత్రాన్ని చూస్తున్నప్పుడు తిప్యరక్షిత బౌద్ధమత విధ్వంస దీక్ష మన కళ్ళఎదుటనే తీసుకొంటు న్నట్లు అనిపిస్తుంది. ఆమెకు గల బౌద్ధమతం పట్ల యీర్ష్యాభావాన్ని వెల్లడిచేసుకోవటంకోసం కాబోలు, బౌద్ధులకు అతి పవిత్రమైన బోధి వృక్షశాఖలను తిప్యరక్షిత, తన నగలు తగిలించు కొనే చిలక కొయ్యలా వాడుతున్నట్లు చిత్రింప బడివుంది. ఈ చిత్రంలో అవనీంద్రుడు ప్రయో గించిన వర్ణాలు, రేఖలు ప్రత్యంగము, తిప్యరక్షిత హృదయంలోని కోపారుణకీలలను ప్రకటితం చేసేవిగా వున్నాయి.

అవనీంద్రుని కృషిఫలితంగా పాశ్చాత్యదేశాల వారు, భారతీయ చిత్రకళకు గల విశిష్టతను గుర్తించారు. భారతదేశం యీ నాటికైన పాశ్చాత్య బాణీలను అనుకరించటంలోగల తమ బుద్ధి మాంద్యాన్ని గుర్తించారంటే అది నిస్సం దేహంగా, అవనీంద్రుడు తన భావమయ చిత్ర రచనలద్వారా భారతీయులకు కల్పించిన కను విప్పు ఫలితమే. అవనీంద్రుడు తన చిత్రాలలో భారతదేశ చిత్రకళకు ప్రత్యేక గుణాలైన సాంకే తిక ఆధ్యాత్మికతలు యిమిడ్చి, స్వదేశీయులకు పరదేశీయులకు తనజాతి కళా సంప్రదాయాల విశిష్టతను చాటిచూపాడు. అవనీంద్రునిచిత్రాలు, ఆయనకు గల ఆత్మవిశ్వాసానికీ, కోమల మనస్త త్వానికీ ప్రబల తార్కాణాలు.

స్కెచ్

"సీతా కల్యాణం"

వృద్ధుల సుబ్బారాయుడు

"ఏవమ్మోయ్, కాంతం! చూడూ...ఈవేళ గుడిలో హరికథ వుందిట!...దాసు చాలా గొప్పగా చెప్తాడట, ఏమయినాసరే నీ వివాళ రాకతప్పదు సుమా..." కేకేసింది నూతి ఆవల వైపునుంచి, నీళ్లుతోడుతూ పొరుగింటి సుంద రమ్మగారు.

"ఆ...! పోనిద్దురూ. ఎప్పుడుడూ ఏవో జరు గుతునేవుంటాయి నాకు తీరికెక్కడ..." అంది కాంతం, అంత తేలిగ్గా ఆవిడ వదిలే ఘటంకాదని తెలిసినప్పటికీ.

"అదేవిటమ్మా! మా కెవళ్ళకీ పన్లులేవా ఏమిటి? రాత్రి పన్లన్నీ అయాక తీరిగ్గా వెళ్దామంటే. వెధవపన్లు ఎప్పుడూ ఉన్నవేగా! ఏమయినాసరే నువ్వు రావాల్సిందే..." నవ్వుతూ అనేసి బిందె పట్టుకు వెళ్ళిపోయింది కాంతం చెప్పే జవాబు మరి వినకుండానే.

కాంతం ఇంటివరసకీ ఆవిడ ధోరణికీ సరిపో యింది. సుందరమ్మకేం మహారాజు ఇంటినిండా మనుష్యులు. తనకి చీకటినే లేచి కాఫీ పొయ్యి ఆంటించిన దగ్గరనుంచీ రాత్రి పనులయేవరకూ అరవచాకిరీ వుంటుంది రోజూ. ఇంక విశ్రాంతి దొరికేది ఆ నాల్గుఘడియలే. మళ్ళీ దిక్కుమాలిన కోడి ఎక్కడ కూస్తుందో తెల్లవారిపోతుంది ఇట్టే. కాఫీ పొయ్యి మళ్ళీ ప్రత్యక్షం. ఏమాత్రం ఆలస్యమయినా భర్తకి అమిత చికాకు. మరి రాత్రి హరికథ కెడితే తన కథ చూచేదెవరు? ఆలోచించుకుంటూ రాత్రి హరికథ సంగతి తర్వాత చూసుకోవచ్చని నీళ్లుపట్టుకుని ఇంట్లోకి వెళ్ళి పోయింది.

"వంటయిందా?" ఇంకా తొమ్మిదిగంటలు కాలేదు. భర్త కేకపెట్టాడు. "మేస్ట్రీటుగారి భార్య ఉదయం ఆరుగంటలకే వండేస్తుంది గాబోలు. ఈయన మరీను"విసుక్కుంది కాంతం.

కాంతం భర్త రామ్మూర్తి రోజూ ఇదేగొడవ.

"మేస్ట్రీటు వచ్చేస్తాడు. కచ్చేరీకి వేళయింది" అని తొమ్మింపావు మొదలు గంటులేస్తాడు. సరి! మరో ఘడియకల్లా కాంతం కొడుకు రామం "అన్నంపెట్టు! స్కూలుకి టైమయిపోతోంది" అని ఒకటే గోలపెడ్తాడు పది కాకముందే. ఒక్క క్షణం ఆలస్యమయితే వాణ్ణి వాళ్ళటీచరు ఔంచీ

ఎక్కిస్తాడట! రోజూ ఇలాగే. ఈ తొందర, గాభరా వుండనేవుంది. రామ్మూర్తి నాల్గుమెతుకు లేసుకొని ఆఫీసుకీ పరిగెడతాడు. రామం సగం సగం తినేసి టైమయిపోయిందంటూ తుర్‌మని పారిపోతాడు.

"మరి నా సంగతో." అన్నట్టుగా ఇవన్నీ అవుతూండగానే చంటిది రాగాలాపన మొదలెడ్తుంది. కాంతం పీటన్నిటికీ అలవాటు చేసుకుంది. కాని ఒకొక్కప్పుడు ఓర్పు వహించలేక ఒళ్లు మండిపోయి నోరులేని చంటిదాన్ని ఒక్కటి చరిచేది. దాంతో అది ఆటంబాంబులా మరి ఊరుకోక పెంకు లెగిరిపోయాలా గోలచేసేది. 'పాపం! ఎందుకొట్టానా' అని తర్వాత చింతించేది ఎంతగానో కాంతం.

రోజులు గడుస్తున్నకొలదీ కాంతానికి సంసారంమీద రోత పుడుతోంది. "ఒక్క ముద్దూ ముచ్చటా లేదు!...ఛీ. పాడు...తనదీ ఒక జీవితమే" అని ఎంతగానో విచారించేది కాంతం. సుందరమ్మగారన్నదీ నిజమే. ఎప్పుడూ ఉన్న పస్లేగా. ఏమయినా సరే, హరికథ కెళ్ళాలని నిశ్చయించింది కాంతం.

అప్పుడే మధ్యాహ్నం! ఇంతట్లో సుందరమ్మగారి కేక "కాంతం! ఒకసారి చేయి సాయం చేస్తావుటమ్మా?" కాంతాని కర్థమయింది. చేయి సాయమని చెప్పి వెన్ను పీక్కుపోయేలా అప్పడాలొత్తిస్తుంది ఆవిడ. "ఓసారి భగవంతుడా!" ఎవరితో చెప్తుంది. వెళ్ళకపోతే బాగుండదు. వెళ్ళింది కాంతం. అప్పుడే హరికథకి సాయంత్రం వెళ్ళడానికి ఇరుగుపొరుగు "మెంబర్స్"ని జత పర్చింది సుందరమ్మగారు. అప్పడాలొత్తడం అవుతూనే వుంది. ఆఫీసునుంచి బంట్రోతు సింహాచలం వచ్చాడు.

"అమ్మా! బాబుగారు కాఫీ తెమ్మన్నారు" సింహాచలం కేక.

"కాఫీ గుండ లేదు. కాఫీ చెయ్యలేదని చెప్పు" ధైర్యంగా అంది కాంతం. భర్తకోపం సంగతి పూర్తిగా మర్చిపోయి. సింహాచలం వెళ్లిపోయాడు.

"ఎన్నని చేస్తుంది? ఒక్కర్తే పాపం! హోటలోంచి తెప్పించుకోరాగూ! మరీనమ్మా యీ మొగాళ్లు!" మగజాతిమీద నిరసన తెలిపింది సుందరమ్మగారు. తర్వాత కాంతాని కేమనాలో తోచలేదు.

పడమటి దిక్కున సూర్యుడు ఒరిగాడు. అప్పుడే సాయంత్రం. మళ్ళీ బోల్డన్ని పన్లు. కాంతం అన్నీ మరచిపోయి పన్లలో నిమగ్నురాలయింది. సాయంత్రం, భర్త రామ్మూర్తి రొప్పుతూ 'ఫైల్స్'తో సహా. తిరిగొచ్చాడు అలసిపోయి మొహం చూస్తే చాలా చికాగ్గా వున్నాడు.

"ఏయ్, ఇలారా!" కోపంగానే పిల్చాడు రామ్మూర్తి కాంతాన్ని.

కాంతానికి తెలుసు. కాఫీ పంపనందునకు ఆ కోపమని.

"ఎందుకండీ! నా కవతల చాలా పనుంది. త్వరగా!" అనికొంచెం భయంగానే అంది.

"నీకేం మతిపోయిందా! నిన్న కాఫీ గుండ తెస్తే ఈవేళ కాఫీగుండ లేదని, కాఫీ చేయలేదని కబురు పంపిస్తావా? చెయ్యడానికి బద్ధకంవేసి? మాట్లాడవేం?" గర్జించాడు రామ్మూర్తి.

మౌనంగా ఊరుకొంది కాంతం. ఇంకేమైనా జవాబిస్తే లాభంలేదని తెలుసు.

"నీకంత ఒళ్లుబద్ధకం లావవుతే, హోటేళ్లలో డబ్బు తగలెయ్యడానికి నీ భర్త ఏం పెద్ద జీతగాడు కాడు...తెల్సిందా?" రామ్మూర్తి ధోరణి జోరుగానే వెళుతోంది. కాంతం వంటింట్లో కెళ్ళిపోయింది. ఇంకా తిడుతూనే వున్నాడు రామ్మూర్తి. ఇంతట్లో చంటిది మళ్ళీ రాగానికి లంకించుకుంది. ఉరిపోసుకుని చావాలనిపించింది కాంతానికి. తమాయించుకుని కొంపసేపయాక పాపని ఊరుకోబెట్టింది. కాఫీచేసి భర్తకిచ్చింది. ఏమనుకున్నాడో ఏమో రామ్మూర్తి మాటాడకుండా కాఫీ తీసుకున్నాడు. ఇంతలో రామం వచ్చాడు. వాడికి బళ్ళో ఏదో "మా జిక్" ఉందట. త్వరగా నాలుగణాలు మాస్టారు తెమ్మన్నారని అల్లరి మొదలెట్టాడు. రామ్మూర్తినడగటానికి వాడికి భయం. అందుకు కాంతాన్ని పీక్కుతినటం మొదలెట్టాడు. కాంతం దగ్గర కానీ అయినా ఉండేకుస్తేగా ఎప్పుడయినా. ఇంక కప్పిరికోటి లాభంలేదు. ఎలాగయితేనేం

సుందరమ్మగారిదగ్గిర అప్పుచేసి ఇచ్చింది. వాడు సంతోషంతో వెళ్లిపోయాడు. "ఇదీవరస రోజూ ఇలా వుంటూంటే తీరుబాటేదీ కథలకీ, కాలక్షేపాలకీ... ఏం బ్రతుకో" నిరాశగా అనుకుంది కాంతం. మళ్ళీ రాత్రి వంట! అబ్బ! యంత్రమయినా నయమే.

భర్త ఆఫీసు కాగితాల్లో ఏమిటో రాసుకుంటున్నాడు. వంటయింది భోజనానికి రమ్మని భర్తనీ, స్కూలునుంచివచ్చిన రామాన్నీ పిల్చింది కాంతం. భర్త కొంతసేపయాక వస్తానన్నాడు. కాంతానికి హరికథ సంగతి జ్ఞాపకానికొచ్చింది. వెళ్ళకపోతే బాగుండదు. తొమ్మిదిగంటలకల్లా భోజనానికొచ్చాడు రామ్మూర్తి కాగితాలలానే వుంచి, భోంచేసి తిరిగి కాగితాలరాతలో నిమగ్నుడయ్యాడు. భోజనాలయాక మిగతా పనులన్నీ ముగించేసరికల్లా పదిగంటలు కావస్తోంది. కాంతాన్ని అప్పుడే రెండుసార్లు కేకేసింది సుందరమ్మగారు. రామ్మూర్తిని అడగటానికి సందేహించింది కాంతం.

* * *

"ఏమిటీ! ఊరికే నలుగురాడవాళ్ళతో కలిసి హరికథ కళ్ళడానికి భర్తనడగాలా! దేనికీ భయం?" తర్కించుకుంది మనస్సులో కాంతం. అర్థంకాక కలవరపడింది. ఇంక మూడోమారు పిలవడానికి బదులు సుందరమ్మగారు స్వయంగా వచ్చింది. చంటిది నిద్రపోతూంది. అది సగంనిద్రలో లేచి రాగానికి లంకించుకుంటుందని కాంతానికి తెలుసు! భర్త సంగతి సరేసరి. ఊరుకోబెట్టడానికి బదులు కాంతాన్నీ, అందర్నీ వంశ పారంపర్యా లిట్టిపోస్తాడు. ఎలాగా వెళ్ళటం? ధైర్యంచేసి భర్తతో చెప్పేసింది....

"గట్టో హరికథకెళ్తున్నానండీ! చంటిది లేస్తే ఒకసారి జోకొట్టే అదే లేచిగి పడుకుంటుంది. నే వెళ్తున్నా!" అనేసి కాంతం నిల్చింది జవాబుకోసం. రామ్మూర్తి లిన్నగా వినిపించుకున్నాడో లేదో "ఊఁ!" అని మాత్రం అన్నాడు. దేనికో ఇంకా భయమే కాంతానికి.

సుందరమ్మగారితో కలిసి హరికథ కెళ్ళింది కాంతం. ఎవరో చాలా పేరుపొందినవాడు! దాసు. చాలా చక్కగా చెప్పుకుపోతున్నాడు దాసు కథ. కాంతం ఒక్క ముక్క వినలేదు. బుర్రలో ఒకటే ఆలోచన... "చంటిది లేచిందేమో! అదేడుస్తూంటుంది. ఆయన తిటిపోస్తారు. ఎందుకొచ్చాన్రా ఈ హరికథకి!" ఇదే ఆలోచన... ఇంక హరికథేం వింటుంది? లేచి నిల్చింది కాంతం వెళ్తానంటూ.

"అదేవిటమ్మా? వచ్చి ముప్పావుగంటకాలేదు. వినిమ్మావిను. అంతా కలిసేపోదాం! చెయ్యిపట్టి కూర్చోబెట్టింది సుందరమ్మగారు. మళ్ళీ కాంతానికి చంటిదాని గొడవే! ఇంక ఉండలేక లేచి వచ్చేసింది కాంతం. సుందరమ్మగారు వెనకాల ఏమో అంటోంది. కాంతానికేమీ వినిపించలేదు. ఇంట్లో రామ్మూర్తి యింకా రాసుకుంటూనే వున్నాడు. ఇంకా పడకొండుకాలేదు.

"అప్పుడే హరికథ అయిపోయిందా కాంతం? అసలు ఇంతకీ ఏంకథ?" అడిగాడు భర్త ఆప్యాయంగా కాంతాన్ని. కాంతానికి ఏడవాలో, నవ్వాలో తెలియలేదు.

"చంటిది ఏడుస్తుందేమో... వచ్చేశా" నంది కాంతం

"ఓహ్! అదా... లేచి కొంతసేపు ఏడ్చింది. మళ్ళీ జోకొట్టే అదే పడుక్కుంది. దానికోసం వచ్చేశావా? బాగుంది!" అన్నాడు రామ్మూర్తి.

ఇలాగ మాట్లాడుతూంటే కాంతానికి భర్త వింతగా కన్పించాడు. "ఛీ! తనదే తప్పు! భర్తని అపార్థం చేసుకుంది" ఎంతగానో వాపోయింది కాంతం. మరి రోజూ ఈ చికాకులు.. ఇవన్నీ ఎందుకొస్తాయి ఇంట్లో!... అర్థంగాక ఆలోచిస్తోంది కాంతం చంటిదానిదగ్గర పడుక్కుని. కాంతానికి నిద్దరపట్టలేదు.

ఎంతరాత్రయిందో ఏమో హరికథ అయిపోయింది గాబోలు సుందరమ్మగారి కంచుగొంతుక నిద్దరపట్టక శూన్యంలోకి చూస్తోన్న కాంతాన్ని కలవరపెట్టింది.

"చాలా గొప్పగా చెప్పాడుసుమా! అందరికీ తెల్సిన సీతాకళ్యాణమే అయినప్పటికీ!... ఓహో!...!" ఏమిటేమిటో పొగిడేస్తోంది సుందరమ్మగారు. అప్పుడు కాంతానికర్థమయింది: కథలో కాదు కథకుడిలో గొప్పతనం వుందని. ఆ